# నా ఇంటర్వ్యూ పోయింది

'విలేజ్ పాలిటిక్స్'-అని మీ నాగరికలోకం యథాలాపంగా కొట్టివేసే విషయాలు అంత తేలికైనవి కావు. అందుకనే ఢిల్లీ నుంచి ఇంటికి తంతి ఇచ్చాను- "నా ఇంటర్వ్యూ పోయింది" అని.

అప్పటికే మా పెదనాన్న ఊళ్ళో, 'ఎగస్ పార్టీ' వాళ్ళను హడల కొట్టిస్తున్నాడు - మా వాడు ఆలిండియా సర్వీసెస్ పరీక్షలో నెగ్గి, జిల్లా పోలీసు సూపర్నెంటు పదవికి ఆర్డర్లు తెచ్చుకోను ఢిల్లీ వెళ్ళాడని. ఈ ప్రమాదాన్ని పెంచటం నా కిష్టం లేదు. మా నాన్నగారి హయాం కృష్ణంరాజుగారి పెత్తనం గతించాక గ్రామంలో కక్షలు బాగా పుంజుకొన్నాయి. ఇప్పుడు మా దాయాది పెదనాన్న బసవయ్యగారిదే మా పార్టీ పెత్తనం.

ఇక నేను తిరుగు ప్రయాణంలో ఉండగా, మా భానుమతి మొగుడు వచ్చి - "ఎందుకు పోయిందో ఒకసారి సింహావలోకనం చేసుకోవోయ్?" అని సలహా. నాకు ఒళ్ళు మండింది. ఢిల్లీలో నేను భానుమతి వాళ్ళింట్లోనే దిగాను. భానుమతి మా వేలిడిచిన మేనత్త కూతురు. 'వాళ్ళింట్లో దిగవద్దు. ఏదైనా మంచి హోటల్లో మకాం పెట్టు. అని అన్నయ్య ఇచ్చిన సలహాను ఎందుకు పెడచెవిన పెట్టానో నా సుప్తచేతన మనస్సుకే తెలియాలి. అతనికి - భార్య మేనబావల మీద ఉండే అసూయతో ఏదో కుంటికూత కూశాడు. నా ఇంటర్వ్యూ సూటుమీద కూడా వ్యంగ్య బాణాలు విసిరాడు. పొద్దున కాఫీ

తాగుతున్నప్పుడే నా మూడ్ భగ్నం చేశాడు. నాకన్నా పదేళ్ళు పెద్దదయిన భానుమతికి ప్రేమలేఖలు రాశానను కొన్నాడో ఏమో, అ అల్పుడు !

*  *  *

ఇంటర్వ్యూ బోర్డులో అయిదుగురు సభ్యులు - ఒక మహిళామణితో సహా. వారి హోదాకు తగినట్లు గది శీతలంగా ఉంది. నాకు శిక్షణ ఇచ్చిన పరమహంసా సుపీరియర్ స్టడీ సర్కిల్ వారి హెచ్చరికలన్నీ తు. చ. తప్ప కుండా నిటారుగా నడిచాను. జేబురుమాలుతో ముఖం తుడుచుకోలేదు.

"గుడ్ మార్నింగ్ సర్స్, మాడమ్."

మొదటి తప్పు - ముందే మాడమ్ అనవలసింది. క్షణంసేపు వాళ్ళు నన్ను కుర్చీలో కూచోమనలేదు. సరికదా ముసి ముసి నవ్వులు. పెదాలమీదే. అంతే! నా మనస్సు మరింత వికలమైపోయింది. భానుమతి భర్తలాగానే వీళ్ళూ నా పల్లెటూరి వాలకం, అంత ఫాషనబుల్‌గా లేని సూటును చూచి ఆనందిస్తున్నారని తోచింది. ఇక స్టడీ సెంటర్ వారి సూత్రాలా? అన్నీ గాలికి ఎగిరి పోయాయ్.

మార్చి మార్చి ఒకే ప్రశ్నను అయిదు విధాలుగా ఆ పంచ సభ్య బృందం నా మీదికి విసిరి వేశారు. "నువ్వు పోలీసు సర్వీసులోనే ఎందుకు చేరదలిచావు? ఐ.ఏ.ఎస్.కు ఎందుకు ప్రిఫరెన్సు ఇవ్వలేదు?"

బదులుగా నేను వాళ్ళకు ఒక పొడుపు కథ చెప్పి విప్పమన్నాను. "ఒక విల్లు, మూడు బాణాలు, ముగ్గురు మనుషులు ఒకచోట కనిపించినాయ్. మరుక్షణంలో ఒక బాణమూ, ఒక మనిషీ మాయమైనాయ్. దీని భావ మేమి తిరుమలేశ?"

వాళ్ళు వెర్రిమొగాలు వేశారు. అప్పుడా పొదుపు కథను నేనే విప్పి - "పోలీసు శాఖలో ఎందుకు చేరదలిచానో గ్రహించుకోండి'' అనేశాను. బహుశః అందుకే నా ఇంటర్వ్యూ పోయుండాలి.

*  *  *

ఆ ధనుర్బాణాలు మా ఇంట్లో ఎన్నేళ్ళ తరబడిగానో, లేక ఎన్ని తరాల నుంచి ఉంటున్నవో అప్పటికి మాకు తెలీదు. అవి మా కంట బడటం కూడా కాకతాళీయంగా సంభవించింది. మా బాల్యపు తొలి గొప్ప అనుభూతి అది

మా గ్రామంలో కాలవల గుమాస్తాగారబ్బాయి-వేణు- దగ్గర సంపాదించిన సినిమా ఫిలిం ముక్కలతో బయస్కోపు ఆటకు కావలసిన సన్నాహా

లన్నీ అన్నయ్య పూర్తి చేశాడు - పాత అద్దం పెంకూ, తెల్ల దుప్పటి, ఇక కావలసింది ఒక చిన్న కిటికీ ఉన్న చీకటి గది. అట్లాంటి చీకటి గదులు మేము 'వెనక ఇల్లు' అని వ్యవహరించే పాత ఇంట్లోనే ఉన్నవి. అక్కడ సాక్షాత్కరించినవే- ఆ పెద్ద విల్లూ, తోలు పొదిలో మూడు అంబులూ! దుమ్ము కొట్టుకొని రాతిగోడకు తగిలించి ఉన్నాయి. అంత పెద్ద విల్లూ, మొనదేలి దుమ్ము కప్పి ఉన్నా పదునుగా కనిపిస్తున్న మూడు అంబులూ.

అంత పెద్ద అంబుల పొదిలో మూడంటే మూడు బాణాలేనా? మాకు అర్థం కాలేదు.

ఇన్నాళ్ళూ మా కంట బడని ఆ పెద్ద ధనుస్సు నారిని, అన్నయ్య లాగి చూశాడు. ఖంగ్.... ఖంగ్.... అని అలలు పుట్టించిన దాని శబ్దం! అది ఈ లోకంలో వినబడే మామూలు శబ్దం కాదు. ఏదో రణన్నినాదం. అనాది కాలాల యుద్ధ స్వనం.

మరీ మాబాల్యంలో, ఆ ఇంట్లో మహాశివరాత్రి పర్వదినాన ఋత్విక్కుల రుద్రాభిషేక గంభీరనమక చమకాలు వినిపించేవి. అట్టి శబ్దమూ కాదు-మేము విన్నది. అసలే ఆ పురాతన గృహం. ఆ చీకటిలో రహస్య వాతావరణం. మేము కనుగొన్న అపురూప శస్త్రాస్త్రాలు. అన్నయ్య నన్ను గట్టిగా కౌగిలించుకొన్నాడు. వాడి శరీరం అపాదమస్తకం వణికిపోతున్నది. నా ఒడలంతా స్వేదం. భయ విహ్వలులమై పరుగు లంకించుకొన్నాము కాని, ఏ సుదూర తీరాలనుంచో వినవస్తున్న నాదబ్రహ్మ ప్రథమ ప్రణవోచ్చారణం లాగా, కురుక్షేత్ర మహా సంగ్రామంలో అభిమన్యుడి పద్మవ్యూహం నాటి ఉన్మాద నినాదంలాగా - ఆ రహస్య శబ్దలయ మమ్మల్ని వెంటాడుతూనే ఉంది.

ఆ అవ్యక్త ఆందోళన నుంచి, తమస్సు నుంచి వెలుగులోకి ఇంటి బయటకు రాగలిగామే గాని, ఏమీ కనిపించటం లేదు. ఎదురుగా అమ్మ నిలిచి ఉన్నట్లు కొద్దిక్షణాల తరువాతే గ్రహించాము.

"ఏమిట్రా ఆ వెర్రిచూపులు? ఎందుకురా వణికిపోతున్నారు! ఇంత సేపూ ఎక్కడున్నారు?" అని అమ్మ విసుగుపోతూనే గదమాయిస్తున్నది. అన్న వీపు మీద చెయ్యి వేసింది. నా చెవి లంకించుకొన్నది.

"ఇక్కడే నమ్మా.... ఇక్కడే" అన్నాం.

"భడవల్లారా... నిజం చెప్పండి...."

"ఆ ఇంట్లో విల్లంబులు.... బయస్కోపు ఆడుతున్నాం."

"ఛా అబద్ధాలు కూడానా? నాన్నగారికి తెలిస్తే చమడా లొలుస్తారు. ఆ తలుపులు తెరిచారా ఇక చూసుకోండి. పాత ఇంటికి సున్నం కొట్టబో తున్నారు. వాళ్ళ వెంట బడ్డారా-నాన్నగార్ని పిలుస్తాను" - అమ్మ కోపంగా ఆ వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోతున్నది.

'వాళ్ళు'- ఎవరోకాదు. చాకలి అదిలక్ష్మి, దాని మొగుడు పరశురాముడు. అస్పష్టంగా...చెట్టుకింద - మాఇంటి రజకులు. కాని, వాళ్ళను మేము గుర్తించి నట్లుగా లేదు. ఏదో మైకంలో ఉన్నాం. నవ్వుతున్న తేరులాగా, దేవుడి పూల రథం లాంటి అదిలక్ష్మి, చెవి-పై అంచున బంగారు పోగుతో ఆజానుబాహుడు పరశురాముడు - చీకట్లోంచి అంత వెలుగులోకి వచ్చి కళ్ళు చికిలిస్తూ చూస్తున్న మాకు - వేరే లోకాల నుంచి భూలోక పరిధికి దిగిన దంపతుల్లాగా కనిపిస్తు న్నారు. ఆదిలక్ష్మి శంఖారావం ఎందుకు చేస్తున్నది? అదేమిటి - పరశురాముడి చేతిలో ఇందాకటి విల్లు? ఎందుకు సంధిస్తున్నాడు? తళతళా మెరుస్తూ, ఇనప మొనతో ఆ బాణం! ఎవర్ని సంహరించటానికి?

"ఏంది రామ లచ్మనులూ? ఏంది మా ముకాన కోతు లాడుతున్నయ్యా బాబులూ!" అంటున్నది ఆదిలక్ష్మి విరగబడి నవ్వుతూ.

పరశురాముడు అమాంతం ముందుకు వచ్చి మమ్మల్నిద్దర్నీ చెరో భుజాన ఎక్కించుకొన్నాడు. మా కల చెదిరిపోయి, గయోపాఖ్యానం నాటకంలో ఎప్పుడో చూసిన ఆ పెద్ద ధనుస్సూ మాయమైపోయింది.

అన్నయ్యా, నేను కవల పిల్లలం. ఆదిలక్ష్మికి మేము రామలచ్మనుల కిందే లెక్క.

* * *

దసరా పండగ వచ్చింది. ఆ తరువాత మా చిన్నక్క పెళ్ళి, మాకొత్త ఇంటికి వెల్లలు వేయటం, గడపలకు రంగులు పూయటం పూర్తి అయింది. ఆ ఇంటి ముంగిటే మంచి రోజని పెళ్ళి పందిరికి గుంజలు పాతారు. ఇక పాత ఇంటిని కూడా సర్ది సున్నాలు కొడ్తున్నారు. మా పల్లెటూళ్ళలో ఇంటి చాకళ్ళే సున్నం కొడతారు. వేరే మేస్త్రీ లుండరు. ఈ హడావిడిలో పాత ఇంటి తాళాలు ఎప్పుడూతీసే ఉంటున్నాయ్. కాని, ఆ పురాణ యుగాల గాండీవపు రహస్య ద్వారాలు మాత్రం తెరుచుకోలేదు. మా ఉత్సుకత మాత్రం దినదినానికీ పెరిగి ఉక్కిరిబిక్కిరి చేస్తోన్నది.

మా పాత ఇంటికీ, కొత్త ఇంటికీ మధ్య దూరం ఏభై గజాలే అయినా, వాటి మధ్య సరిహద్దులుగా నిలిచి ఉన్నవి రెండు పురాతన నింబ వృక్షాలే

అయినా - అవి రెండు యుగాల చరిత్రకు ప్రతీకలుగా తోచేవి. పాత ఇంట్లో తాళపత్ర గ్రంథాలు, సగం నిర్మాణంలో ఆగిపోయిన దేవాలయ శిల్పఖండాలు, గ్రామ సమారాధనకు సరిపోయే ఇత్తడి భాండాలు, గుండిగలు, బ్రహ్మరాక్షసి గరిటెలు, అడ్డిగలు, ఉపయోగంలో లేని పందిరి మంచాలు, సింహాసనాల్లాంటి పాత కుర్చీలు - ఇప్పుడు కొత్తగా మా కంటబడ్డ ఆ భారత యుద్ధ గాండీవం. దాని రహస్యాన్ని అమ్మ చెప్పదు. నాన్న నడిగే ధైర్యం లేదు. మా చిన్నక్కవట్టి బ్రభాజమానం. బామ్మ బతికుంటే తెలియజెప్పేదేమో!

అక్కడ సంస్కృత పాఠశాల చాలా వత్సరాలు నడిచిందనీ, పండితులు నిరంతర చర్చలతో పురాతన ప్రబంధాలను పరిష్కరించే వారనీ, వాస్తుశాస్త్ర మీమాంసలు ఒక కొలిక్కి వచ్చేవనీ కథలు చెబుతుండేది. మరి అంత పెద్ద కొంపను వదిలి మళ్ళీ ఈ కొత్త గృహాన్ని ఎందుకు కట్టుకొన్నారో ఎవరు విశదీకరిస్తారు? మేము తూనీగల్ని పట్టినా, గండుచీమల్ని చంపినా దండించే ఈ ఇంట్లోవాళ్ళు - యుద్ధానికీ, హింసకూ ప్రతీక అయిన ఆవిల్లంబుల్ని ఎందుకంత భద్రంగా దాచారు?

ఆ ఆలోచనలతోనే ద్వాపరయుగం పొలిమేరలు దాటి, మరుసటి దినం మా మామూలు అమరకోశం పాఠానికి కృష్ణంరాజుగారి గృహ ప్రాంగణంలో అడుగు పెట్టాం. మామూలు విద్యార్థులంగా కాదు. ఆ విల్లంబుల చరిత్రాంశాల్ని కూలంకషంగా తెలుసుకోవాలని.

మా గ్రామంలో వేద సంస్కృత పండితులు వేరే లేక కాదు. కృష్ణంరాజుగా రంటే నాన్నగారికి గౌరవ ప్రపత్తులే కాదు, భక్తి తాత్పర్యాలు ఊహించలేనివి. ఆయన స్వచ్ఛోచ్చారణ, వ్యాస సంతతి మహాపురుషుల్ని కళ్ళముందు నిలిపే గంభీర శాంతాకారం. రోజు కొక పూటనే అపక్వాహారం. తేనె - అయినా ఆ వెడదకన్నుల కాంతి తగ్గదు. ఆ దబ్బపండు శరీర చాయ వాసిపోదు. ఎన్నో కథలు చెబుతారు - రాజయోగ సమాధిలో కూచొని గాలిలోకి లేస్తాడని, రెండోసారి పళ్ళు వచ్చాయనీ, వయసు శతమానం దాటిందనీ. బంగారం తయారించే పరుసువేది తెలుసనీ. గొప్ప వాస్తు శాస్త్రజ్ఞుడని మాత్రం మాకు తెలుసు. ఇంటి స్థలం మట్టిని చేతిలో నలిపి పరీక్షించి, ఆ గృహాన్ని అవలీలగా వర్ణించడం చూశాం. రామలింగేశ్వర దేవస్థానానికి ఆయనా, చెన్నకేశవుడి గుడికి నాన్నగారూ ధర్మకర్తలు. వేదాంత చర్చల్లో నాన్నగారితో ఏకీభవించని సమయాల్లో - హరి హరా భేదం అని నగుమొగంతో దాట వేయటం, ఆయన సొత్తు.

మేము సింహద్వారం దాటీదాటగానే నడవలో నుంచి ఆయన గంభీర వచనాలు వినబడుతున్నాయి. అక్కడే ఆగిపోయాము. కొద్ది క్షణాల్లో ఆ ఊరి పెద్ద కాపు - తిరుపతయ్య తల వంచుకొని మా ముందునుంచే నడిచి పోతున్నాడు. ఊరంతా అప్పటికే వ్యాపించిన వదంతుల్ని మేమూ విన్నాం. తిరుపతయ్య ఇంటి దక్షిణ భాగంలో గద్ద వాలిందట. ఇంటి నడిబొడ్డులో భూమి లోంచి మొండి చెయ్యి మొలుచుకు వచ్చిందట. కృష్ణంరాజుగారి వాస్తు కోసం వచ్చి ఉంటాడని గ్రహించాం. ఆ మోతుబరి కుటుంబానికి మంచి పేరు లేదు. వడ్డీ వ్యాపారంలో చాలామందిని ముంచేశా డంటారు. కొడుకు తాగుబోతు, తిరుగుబోతు.

మూగ సంధ్య, మసగ మసకగా ఉంది. మా రాకను గురువర్యులు గమనించినట్లు లేదు. పై దూలాని కేసి నిశితంగా పరికిస్తూ తనలో తానే మాట్లాడుకొంటున్నారు.

"ధర్మసింధు ప్రకారం ఇల్లు పాడుబెట్టాల్సిందే. కాని ఇష్టం లేదట. మంత్ర తంత్రాలతో సరిపెట్టాలిట. అవును - పాపం పండి విషఫలమై కాన వస్తున్నది. ఆ గృహంలో దుర్మరణం తప్పదు. ద్వంద్వ అశుభాల సూచన." ఆ వాక్యాలు పెదకాపును గురించే అని మాకు అవగతమైంది- వెనుదిరిగి పోదామా అని తలపోస్తుండగానే ఆయన మమ్మల్ని చూశారు.

"ఎంతసే పయింది?"

మేము మాట్లాడ లేదు. ఆ శాప వాక్యాల భవిష్యపరిణామాన్ని ఊహించుకొంటున్నాము.

"నిన్న రాత్రి నాటకం చూశారా?"

అప్పటికి - శరన్నవరాత్రారంభం నుంచి ఊళ్లో నాటకాలు జరుగుతూనే ఉన్నాయి. యానాది భాగవతులు సరస్వతి పూజనాడు 'ఉషాపరిణయం', మైలవరం సమాజం వారు మహర్నవమికి 'ఉత్తర గోగ్రహణం' ఆడారు. మేము తల లూపాం.

"మంచిది. నాటకం కూడా ఒక పాఠమే. చదవటం మంచిదే. రాయ టమూ అంతకన్నా మంచిదే. కాని, చూచిన దాన్ని గూర్చి ఆలోచించటం ఇంకా మంచిది. రేపు శమీ పూజ. జమ్మి చెట్టును ఎందుకు పూజిస్తారో ఆలో చించండి. రేపు శమీపూజ ఉత్సవానికి వచ్చే ఓపిక లేదు. నాన్నగారికి చెప్పండి. ఇక పాఠం సాగదు. పోండి" అన్నారు.

నవమి చంద్రుడు ఉదయించాడు. ఆ మసక వెన్నెల మీద ఏదో నీడ సోకినట్లుగా కృష్ణంరాజుగారి నర్మగర్భ రహస్య సంభాషణలు. ఎవరీయన? జనన మరణ చక్ర పరిభ్రమణను స్తంభింపజేయలేక విఫలుడైన ముని పుంగవుడా? ధ్రువుడి వలె చిరంజీవియా? ఎవరు?

విల్లంబుల రహస్యాన్ని - ఛేదించే అవకాశం లభ్యపరచకపోయినా, ఇంకెన్నో లోతైన అంతరంగ తరంగాల్ని మా గురువర్యుల ప్రోత్సాహ వచనాలు ఊగించినవి - మా మానస సముద్రంలో. అంతటి మహా ధనువు పూజా పునస్కారాలు లేకుండా, ఆ చీకటింట్లో దిక్కులేని పక్షిలాగా పడి ఉండకూడదు. రేపు విజయదశమి. సీమోల్లంఘనం, పారువేట ఉత్సవం. ఎవరి కంట బడకుండా మా విల్లును కూడా జమ్మి చెట్టులో కొంత సేపు దాచి, గుప్ చిప్‌గా మళ్ళీ స్వస్థానం చేర్చాల్సిందే. రేపటి దినం మంచి అదను కూడా. నాలుగు కోశల దూరాన ఉన్న మా పెద్దక్క అత్తవారింటికి మేనా వెళుతుంది. అమ్మా నాన్నా ఆ హడావిడిలో ఉంటారు. మా బావగారు అలిగి పెద్దక్కను ఈ పండక్కి పంపలేదు.

* * *

మేము కవల పిల్లలం కదా, గట్లు తెగిన నాటి కృష్ణానది పొర్లు వలె ఒకేసారి జమ్మిపూజ శ్లోకం పాడటం, ఆ లయతోనే ఇంటి ముఖం పట్టటం - "శమీ శమైతే పాపం, శమీ శత్రు వినాశనం, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శనం."

కృష్ణంరాజుగారి లోగిలి నుంచి మా కొత్త ఇంటికి అడ్డదారి ఒక చిన్న అరణ్యంగా తోస్తుంది. మధ్యలో మా తోట, జెముడు గచ్చపొదలు, మనిషి ఎత్తున జమిలి పాము పుట్టలు. సర్పాలు యథేచ్ఛగా తిరుగుతుంటాయని ఆ దారి మాకు నిషేధం. మా తోట మొదట్లోనే ఏతాం బావి. దాని పక్క భూమంతా గుడి మాన్యం. చాకలి రాఘవులది. పరశురాముడి మామకు నాన్నగారు సేద్యం కౌలు ఇప్పించిన చోపుదారి మడి కూడా దాన్నానుకొనే ఉంది.

వెన్నెల్లో పరశురాముడు, ఆదిలక్ష్మి - ఆ మడికి ఏతాం వేసి నీరుమళ్ళు చేస్తున్నారు. దగ్గర కొచ్చేసరికి మమ్మల్ని గుర్తించి పరశురాముడు పిచ్చి సంతోషంతో గడకర్ర ఆసరాతో చేతులూపుతున్నాడు. ఆదిలక్ష్మి వాడిమీద నీళ్ళు చల్లి చిలిపితనం చేస్తున్నది.

"రామ లచ్మనులూ...యాడ్నించి? అటేపు యెల్లమాకండి...పురుగు పుట్రా..." ఆదిలక్ష్మి కేకలు వేస్తూనే మొగుడికి సంజ్ఞలు చేస్తున్నది. బహుశః

మాకు తోడుగా వెళ్ళమనేమో! పరశురాముడికి మాటలురావు. మూగి. ఆదిలక్ష్మికి మేనబావే గదా! మేము అడుగు సాగిస్తూ ముందుకు వేగంగా పోతున్నాము. పోతున్నామే గాని, ఆదిలక్ష్మిపాట సంపెంగి పూల గాఢసువాసనవలె మమ్మల్ని తరుముతూనే ఉన్నది.

ఈ రాత్రి, ఈ ప్రకృతి, ఈ పాట అంతా-తమసృష్టే అయినట్లుగా ఆ యువ దంపతులు. ఎంత అందంగా నవ్వుతుంది ఆది! నవ్వులో, నడకలో, చూపులో, ముఖంమీది బొట్టులో ఉప్పెన లాంటి నిండుతనం. ఈ మూగవాడిని ఎందుకు చేసుకొన్నది? అనాథ అనా? మేనబావ అనా? వాడిబలిష్ఠ అవయవ నిర్మాణంలో మెలికలు తిరిగి, ఆహ్లాదం కొలిపే కండరాలను మోహించా? లేక ఆ అమాయక యువకుడి నిరంతర మందహాసానికి సమ్మోహితురాలైనదా? ఏమో!

అన్నయ్య వేపచెట్టు కింద హఠాత్తుగా ఆగి అన్నాడు: "ఆ మాట మనం నాన్నగారికి చెప్పవలసింది."

పదిహేను రోజుల కిందటి మాట. సాయంత్రం బడినుండి వస్తూన్నాం. ఆదిలక్ష్మి మాకోచీటీ అందించి చదివి పెట్టమన్నది. తనూ చిన్నప్పుడు మూడు దాకా బళ్ళో కెళ్ళిందిగాని, అర్థం కాలేదు కాబోలు. చీటీ చదువుకొని ఆది వంక చూశాం.

"ఏం దది బాబులూ?"

"రంగారావు నిన్ను రాత్రి పశువుల కొట్టంవద్దకు రమ్మని రాశాడు." రంగారావంటే పెదకాపు తిరపతయ్య కొడుకే.

"దొంగ సచ్చినోడు. ఆడి శిరుసు మండిపోను! ఆడి జిమ్మదియ్య!" అని కోపంతో చింపివేసింది.

ఆ విషయం మేమెవ్వరికీ చెప్పలేదు. తనే ఇంట్లో చెబుతుందని తల పోశామేమో! అంతకు ముందు, మా బళ్ళో చేరిన కొత్త కుర్ర మాస్టారు దాని చెయ్యి పట్టుకొన్నాడట. ఆ సాయంత్రం నాన్నగారు అతన్ని పిలిపించారు. కృష్ణంరాజుగారు కూడా ఉన్నారు. ఏంచీవాట్లుతిన్నాడో లేక రాజుగారి చేతికర్ర దెబ్బలే రుచిచూశాడో, మళ్ళీ సెలవు పెట్టి వెళ్ళినవాడు పత్తాలేడు. ఇది గ్రామ పెత్తందార్లతో వ్యవహారం.

* * *

విజయదశమి - పాత ఇంటికీ, కొత్త ఇంటికీ మామిడి తోరణాలు. ఇంట్లో పిండి వంటలు. అగ్రహారం బ్రాహ్మణులకు సంభావనలు ముట్టాయి.

నాన్నకు, అమ్మకు క్షణం తీరిక లేదు. పారువేట ఊరేగింపుకు పురమాయించిన బాండ్ మేళగాళ్ళు ఆలస్యంగా వచ్చినా, ఉత్సవం పెందరాళే ముగిసింది. మా రక్తనాళాల్లో రక్త ప్రవాహవేగం కొలవటానికి కొత్త యంత్రం అవసరం అనిపిస్తున్నది. మా విల్లంబులకు శమీవృక్ష ఆరోహణ, పూజ- ఆ సన్నాహంలో ఉన్నాం.

తెల్లవారుజామున పెద్దక్క వాళ్ళ ఊరికి మేనా బయలుదేరుతుంది. రజకులు మేనాకు అలంకారం చేసి, పరదాలు కట్టి మా కొత్త ఇంటి వరండా ముందు దింపారు. ఇంటి పనుల సర్దుడుకు ఆదిలక్ష్మి ఇంకా రాలేదని అమ్మ విసుక్కుంటున్నది. బావగారికి పండగ పట్టుబట్టల సెలెక్షనుకు వెళ్ళిన నాన్న గారింకా రాలేదు. ఆ సమయాన్ని మించిన అదను మళ్ళీ లభించదు.

"అమ్మా! మేం 'కీచక వధ' నాటకానికి వెళ్తున్నాం"- ఇదే ఈ ఉత్స వాల్లో చివరి నాటక ప్రదర్శన.

"పెందరాళే తిరిగి రాండి. వెళ్తూ వెళ్తూ ఈ బుట్ట కృష్ణంరాజుగారింట్లో ఇచ్చిపోండి."

అవి అరిసెలు. అవంటే ఆయనకెంతో ప్రీతి. మేం వెళ్ళేసరికి ఆయన రుద్రవీణ వాదనలో ఇంకో లోకంలో ఉన్నాడు. నిశ్శబ్దంగా బుట్టను అక్కడే ఉంచి జారుకున్నాం. ఘంటశాల రంగయ్య గుప్త కొట్లో కొవ్వొత్తులు సంపా దించి మా పాత ఇంటివేపు పరుగులు తీశాం. వెన్నెల్లో కుక్కలు ఆడుకొంటు న్నాయ్. నాటకానికని ఆడా, మగా, పిల్లలూ తరలిపోతున్నారు.

ఆల్ క్లియర్ సిగ్నల్.

పాత ఇంటి తలుపులకు తాళం వేసిలేదు. కొవ్వొత్తి వెలిగించి అన్నయ్య లోనికి ప్రవేశించాడు. నేను బయట కాపలా. ఇంకో క్షణంలో అన్నయ్య కేక వినబడ్డది - ఆందోళనా స్వరం:

"తమ్ముడూ!"

ఒక్క ఉదుట్లో నేను లోపలికి దూకిపోయాను.

అక్కడ విల్లు లేదు! అంబుల పొది మాత్రం ఉన్నది. అందులో మూడు అంబులకు బదులు రెండే రెండు, మమ్మల్ని చూసి ఆశ్చర్యపోతున్నట్లుగా కనిపిస్తున్నాయ్!

దుఃఖం! నిరాశ, విభ్రమం, భయం ఆవహించాయ్. కొవ్వొత్తి ఆర్పేసి వచ్చిన దారినే తిరుగుముఖం పట్టాం.

గచ్చుపొద ముంగిట అన్నయ్య నా చేతిని పట్టి గుంజుతున్నాడు. ఇంకో భయానక దృశ్యం. మసక వెన్నెల్లో ఆదిలక్ష్మి దాదాపు వివస్త్రగా భూమి మీద పడి ఉన్నది. చిరిగిపోయిన రవికె, వక్షోజాలు ఆచ్ఛాదన లేక నగ్నంగా ఆకాశం వంక చూస్తున్నాయ్. చీర మీద రక్తపు డాగులు.

"ఆదీ.... ఆదీ....!"

మహిషాసుర మర్దనలో అలసిపడిపోయిన అపరకాళిలాగా ఆ జుట్టూ ముఖమంతా పరచుకొన్న కుంకుమ బొట్టూ. "ఆదీ.... ఆదీ!" తల మీద చేయి ఉంచి ఊగించాడు అన్నయ్య.

సన్నగా మూలుగుతున్నది. శరీరం కంపించుతున్నది.

"చచ్చిపోలేదు తమ్ముడూ.... నీళ్ళు.... నీళ్ళు"

అన్నయ్య అరుపుకు నేను ఏతాం బావివైపు ఉరికిపోయాను. బొక్కెన అడుగున నీళ్ళను దోసిట్లోకి ఎత్తి వెనుదిరిగి పొద చుట్టూ తిరిగానో లేదో బొక్కబోర్లా పడిపోయాను. కాళ్ళకేదో పదార్థం తగిలింది కాబోలు. అక్కడ కనిపించింది తిరుపతయ్య కొడుకు రంగారావు శవం. గుండె లోతుగా దిగిన బాణం! వాడి రెండు చేతులూ రెండు దిక్కులకూ అచేతనంగా పరుచుకొని భూపతనమై ఉన్నాడు. నా ఆలస్యానికి కాబోలు పరుగిడి అసహనంగా వచ్చిన అన్నయ్య కళ్ళు, అప్పుడే మబ్బులు వీడిన దశమి చంద్రుడి వెలుగులో మిల మిలా మెరుస్తున్న బాణంపై పడ్డాయి.

"తమ్ముడూ.... ఆ బాణం లాగేసెయ్!"

ఒక్క ఊపుతో బాణాన్ని లాగేశాను. నాలుగంగుళాల వరకు రక్తసిక్తమై ఉన్నది. నా చేతి నుండి దాన్ని అన్నయ్య లాగేసుకొని నీటిమడుగులో శుభ్రంగా కడిగేశాడు. నాకన్నా కొద్ది నిమిషాల ముందే పుట్టినా అన్నయ్య నిజంగా నాకు అద్వితీయ నాయకుడే. ఇద్దరమూ ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. కాని నా కాళ్ళు వణుకుతున్నవి.

"భయపడకు.... ఈ బాణాన్ని తోలు పొదిలో పెట్టిరా."

నా చేతిలో కొవ్వొత్తి లేకపోయినా, లోపల గోడను ఇంకో మహదాశ్చర్యం! ఆ అంబుల పొది పక్కనే మళ్ళీ విల్లు వేళ్ళాడుతున్నది!

"అన్నయ్యా.... విల్లంబు.... విల్లు.... తిరిగి వచ్చింది."

"స్స్.... నాకు తెలుసు. శబ్దం చేయకు. పరశురాముడు పరుగెత్తిపోవటం చూశాను. ఏతాం వేసి నీళ్లు తోడు.... ఆదిలక్ష్మి బతుకుతుంది."

* * *

అప్పటిదాకా పిన్‌డ్రాప్ సైలెన్స్‌లో వింటున్న ఇంటర్వ్యూ బోర్డు వారు కనుబొమలు ఎగరవేసి అన్నారు.

"వాటీజ్ యువర్ పాయింట్? నీ పొడుపు కథ అయిపోయిందా?"

నా జవాబు -"పాయింటేమిటంటే మేము కీచకవధను చూచాము, నాటక ప్రదర్శనానికి వెళ్ళకుండానే. నా కథ అంతం కాలేదు. ఇక్కడే ప్రారంభమవుతున్నది."

"ప్లీజ్ ప్రొసీడ్" అన్నారు వారు.

* * *

మేము వేపచెట్టు కింద నీడలో బండ మీద ఒక గంటసేపు గడిపాము- ఒక్క పలుకూ లేకుండా. మా నల్లావు నెమరువేస్తూ మమ్మల్నే తిలకిస్తున్నట్లుంది. దూరాన్నుంచి నాటకంలో సూత్రధారుడి ప్రథమ పరిచయ వాక్యాలు వినబడుతున్నవి. నిశ్శబ్దంగా ఇంట్లో ప్రవేశించాము.

ఎదురుగా నాన్నగారు, కృష్ణంరాజుగారు పెద్ద కుర్చీల్లో, వారి పాదాల ముందు చాకలి రాఘవులు, పరశురాముడు. వాడి పినతండ్రి. బయట మేనా నిద్రలో ఉన్నట్లుంది.

"ఎంత లోతు తవ్వార్రా?" అని నాన్నగారి ప్రశ్న.

రాఘవులు చెబుతున్నాడు - "మడిసి నిలువున - పైన నా చేతి మేర. నీళ్ళు ఊరినై దొరా."

"చెట్టు కిందేనా?"

"ఔను దొరా!"

"ఇక శవాన్ని తీసుకెళ్ళండి!" కృష్ణంరాజుగారి ఆజ్ఞ.

చాకలివాళ్ళు మేనా ఎత్తుకుంటున్నారు భుజాలపైన. కృష్ణంరాజుగారు పని అయిపోయినట్లు మాటా మంతీ లేకుండా వెడలిపోయారు.

నాన్నగారు మమ్మల్ని కూచోమన్నారు. "ధనుస్సునూ, అంబుల్నీ చూశారు. వాటి స్థానాల్లో అవి అమరినై. అవునా?"

మేము తలలు పంకించాం.

"ఏదో ముహూర్తాన అవి మీ కంటపడక మానవని తెలుసు. మీకో రహస్యం చెబుతాను - మీ సందేహం తీరేందుకు. ఆ అస్త్రాలు ధర్మరక్షణకు మన ఇంట్లో రెండు తరాలనాడు ప్రవేశించినవి. ఈనాడు మీరు చూసిన దృశ్యాలు కాని, ఈ ఉదంతం గాని నేను బతికి ఉన్నంతవరకూ మీలోనే దాచుకోవాలి."

"ఊం."

"మీరు చరిత్ర పాఠాలు చదివారు. మా తాతగారు ఒకానొక సందర్భంలో ఈ ధనుర్విద్యను అథర్వణ వేదం నుంచి బయటికి లాగారు. ఆ విద్య నేర్చు కోటమే కాదు, మన గ్రామాన్ని, చుట్టుపక్కల గ్రామాల్ని మరాఠీ పిండారీ దండుల బారి నుంచి కాపాడారు. ఈస్టిండియా కంపెనీ రాచరికం రోజుల్లో ప్రబలిన ఈ అరాచక రాక్షస బృందాలు చేయని అకృత్యం లేదు. దోపిడీలు, హత్య, స్త్రీ శిశు మానభంగాలు. గృహ దహనాలు, బీభత్సం. మా తాతగారూ కృష్ణంరాజుగారి తండ్రి- అశ్వారూఢులై వస్తున్న దండు గురించి వేగుల ద్వారా విన్నారు. విల్లంబుల్తో చెట్ల కొమ్మల హరితంలో పొంచి కూచున్నారు. ఒకేసారి అయిదు బాణాల్ని వాయు వేగ, మనోవేగాలతో వదిలే శక్తిమంతులు వాళ్ళు- అట్లా రహస్యంగా పొంచి ముందుకు వస్తున్న బందిపోట్ల గుర్రాల్ని, వాళ్ళ శిరస్సుల్ని ఖండించారు - ఈ బాణాలతో. నాయకుల చావుతో దండు ఛిన్నాభిన్నమైపోయింది. గ్రామస్థులు ఈటెలతో, కట్టెలతో వాళ్ళ వెంటపడ్డారు. మన గ్రామం చెక్కుచెదరలేదు. కాని, ఆ బాణాలు ఎవరు సంధించారో ఈనాటికీ ఎవరికీ తెలియని రహస్యం. మా రెండు వంశాలమధ్యనే ఉన్నదది."

మా కళ్ళు చెమర్చినవి.

"మళ్ళీ హెచ్చరించను" అని నాన్నగారు ముగించారు.

* * *

మా చిన్నక్క వివాహం ఒక శుభ ముహూర్తాన- ఉత్తరా నక్షత్రయుక్త వృషభ లగ్నంలో బ్రహ్మాండంగా జరిగింది. గ్రామానికంతా విందు. రజకు లకు ఇనాములు లభించినాయ్. అయితే, ఊళ్ళో తిరుపతయ్య కొడుకు రంగా రావనే మదించిన యువకుడు నెల రోజుల్నుంచీ కనిపించటంలేదని చెప్పు కొంటూనే ఉన్నారు- గుసగుసలుగా. బహిరంగంగా.

మా అక్క పెళ్ళి ముగిసిన సరీగ్గా పది రోజులకు - పరశురాముడు హఠాత్తుగా మరణించాడు. "పాపం, విషజ్వరం. నోరు విప్పి చెప్పలేకపోయాడు. అతిగా కల్లు తాగాడు" అన్నారు కృష్ణంరాజుగారు.

ఆ మధ్యాహ్నమే వాడి అంత్యక్రియలు జరిగినై. వాళ్ళను దహనం చెయ్యరు గదా! శైవ సంప్రదాయం ప్రకారం నాన్నగారు చెప్పిన చోట భూ స్థాపితం చేసి వచ్చారు. మనిషి నిలువూ, పైన బారెడు తీసిన గోతిలో పై సగ భాగంలో వాడిని నేలతల్లికి అప్పగించారు రాఘవులూ, రజకులూ. వాడికోసం నాన్న కొనిపెట్టిన ఇత్తడి ఇస్త్రీపెట్టెను చూచుకొని ఆదిలక్ష్మి భోరున ఏడ్చిందట.

దీపావళి తరవాత కాబోలు, మా ఊరికి పోలీసులొచ్చారు. గొల్లలు చెప్పిన ఆధారాల ఆసరాగా కొత్తగా పడ్డ సమాధుల్ని వెట్టిలచేత త్రవ్వించారు. ఒక్కటే. ఆ గోతిని తవ్వగానే శిథిలమైపోతున్న పరశురాముడి శవాన్ని చెవి పోగు ఆధారంగా గుర్తించి పూడ్చివేశారు. ఆ శవం కింద అప్పటికే పంచ భూతాలలో మిళితమైన ఇంకో ఎముకల గూడు ఉన్నదని ఎవరికి తెలుసు? పోలీసులు కేసు క్లోజ్ చేశారు.

* * *

సింహావలోకన చేసుకోమన్న భానుమతి మొగుడు అంతా విని- "పోలీసు ఉద్యోగానికి వెళ్ళి, వాళ్ళనే ఫూల్స్ చెయ్యబోయావన్న మాట!" అని, ఆ మత్సరమూర్తి విషపునవ్వు నవ్వాడు. "అందుకన్నమాట నీ హడావిడి టెలిగ్రాం?"

నేనూ ఒక చిరునవ్వు విసిరేశాను.

వాళ్ళనుగాదు నేను ఫూల్‌ను చేసింది. నిన్ను. నా ఇంటర్వ్యూ పోలేదు. నేను సెలెక్టు అయ్యాను. అవునయ్యా అన్నగారూ! మా గ్రామీణ రాజకీయాలు తమకు అర్థం కావు. సరేనా! సైకాలజీచదువు. ఇడ్, ఇగో, సూపర్ ఇగో అనే మూడు మానసికావస్థలున్నాయి. నేను టెలిగ్రాం ఇచ్చింది- ఊళ్ళో కల హాలు తగ్గుతాయని."

భానుమతి మొగుడు తెల్లమొగం వేశాడు. సంపూర్ణ తృప్తితో నేను మా ఊరికి బయలుదేరాను. ○

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
21-8-1991

# కుడిచేయి - ఎడమ చేయి

మధ్యాహ్నం భోజనాల వేళకు ముందుగానే చేతులు జాడించుకొంటూ శ్రీనివాస రావు యింటికి తిరిగి వచ్చేశాడు. వాళ్ళమ్మ సీతకు పప్పుచారు వేడి వేడిగా వడ్డిస్తున్నది. రోజూ నాన్నగారితో గాని కంచం ముందు కూచోని పిల్ల యివ్వాళ చెడ్డ ఆకలివేసి ముందే భోంచేస్తున్నది - సీత.

"ఆడుగోనమ్మా - అన్నయ్య!"

వాళ్ళమ్మ-కథల్లో అమ్మలాంటిదే గాని అంత అబల గాదు. గుండె ధైర్యం గల తల్లి.

"అదేమిట్రా - అప్పుడే వచ్చేశావు? ఆ ఇంటర్వ్యూనా - అదేమిటి? అది అయిందాకా వున్నావా లేదా?" అని వంటింట్లోంచే కొడుకును కేకేసింది.

అప్పటికే శీని వచ్చి వడమటింటి గడపమీద కూర్చుని చెల్లెలి ఎంగిలి గ్లాసులోని చల్లటి మంచి నీళ్ళను గడగడా త్రాగేశాడు. - "కాసిని మజ్జిగియ్యవే - దాహంగా వుంది" అన్నాడు.

"బాగానే వుంది- పరగడుపు కడుపూనూ, నీళ్ళ విందూనా? లేలే! ఆ కంచం యిట్లా పెట్టుకో. అయితే అడిగిందానికి సమాధానంగా చెప్పవేమిట్రా?"

"నాన్నకు గాదుటే సమాధానం చెప్పాల్సింది? ఇన్నాళ్ళనుంచీ నీకు నా నిరుద్యోగం సంగతి అంత పట్టింపు లేదనుకొంటున్నా."

"ఒరేయ్- శీనీ! చెప్పకపోతే చెప్పకపొయ్యావ్‌గాని, కడుపు తరిగే మాటలు మాత్రం అనొద్దురా" అని ఆమె కళ్ళ నీళ్ళు కుక్కుకున్నది.

సీత అన్నయ్యను కొంచెం అజమాయిషీ చేస్తూ, "ఏమిట్రా అన్నయ్యా, మరీనూ? నాన్నకునాన్న, నీకు నువ్వు ఆమె మీద పట్టించారేమిట్రా? అయితే ఆ ముక్క చెపితే నీ బంగారమేమీ పోదుగా?" అని అడిగింది మజ్జిగముద్ద అవలకు నెడుతూ.

"అదిగాదే. వాళ్ళకు కావలిసింది-స్టెనోగ్రాఫరు. నువ్వంటావే అమ్మా - షార్టుహాండు టైపురైటరని - ఆ ఉద్యోగం ఖాళీ. చివరికి నాన్న పోరు పడలేక సీతతోపాటు నేనూ యింట్లో నాలుగు గీతలుగీశాగా! వాళ్ళ టెస్ట్ చేసినట్లయితే నేనూ నెగ్గేవాడినే. కాని ఆ కంపెనీ డైరెక్టరు గారికి మగ స్టెనోగ్రాఫర్లు పనికిరారట.''

"మరి?"

"ఆ ఖాళీ ఆడవాళ్ళకని ప్రత్యేకించారు."

శీని సీతవంక చూచాడు. సీత తలవంచుకొని అమ్మవంక చూచింది. అమ్మకు అర్థమైంది. నిన్ననే ఆమె చేతికి మిగిలివున్న ఒక్క బంగారం గాజూ తాకట్టు కిందకు పోయింది. (నాన్నగారు ఎప్పుడు వస్తువులు తాకట్టు పెట్టినా-వచ్చేనెల నాఫించను డబ్బులు రాగానే మార్వాడీ వాడినుంచి విడిపించి తెచ్చేస్తాలేవే అని అభయం చెబుతూంటారు).

శీని కొంచెంసేపు అమ్మ మట్టి గాజుల వంకచూచి తనలో తను గొణుక్కున్నట్లుగా అన్నాడు-

"ఇవ్వాళ నా బదులు సీత వెళ్ళివున్నట్టయితేనా? తప్పకుండా ఉద్యోగం వచ్చి వుండేది."

"ఛా! ఆ మాట మీ నాన్నగారు వినేటట్టుగా అనేవు, నిన్నూ నన్నూ దాన్నీ గూడా శాపనార్థాల్లో ముంచి తేలుస్తారు" అని అమ్మ హెచ్చరించింది.

సీత కంచం ఎత్తుతూ, స్టెనోగ్రఫీలో ప్రేజులకు కొన్నింటికి గుర్తులు జ్ఞప్తికి తెచ్చుకొంటోంది. తనా? ఉద్యోగం చెయ్యటమా? అమ్మో! అంతమంది మగాళ్ళ మధ్యనా? అన్నయ్య ఏం భయంలేదంటాడు. నాన్నగారు రోజూ బజార్లలో ఆడపిల్లల్ని ఏడిపిస్తున్న రౌడీల కథలు, బస్సుల్లో సీట్లు దొరక్క నిలబడ్డ పిల్లల్ని వెక్కిరించిన కండక్టర్ల పొగరు మోతనం గురించే వల్లిస్తూంటారు. మరి తనెందుకు చదివినట్లు? పెళ్ళికా? అమ్మనాన్న కష్టాలెవరు తీరుస్తారు?

శీని గడపమీంచి లేస్తూంటే, తల్లి వద్దని సౌజ్ఞచేసి - 'శీనీ! నువ్వు లక్ష చెప్పు. కుడిచెయ్యి కుడిచెయ్యే. ఎడమచెయ్యి ఎడమ చెయ్యేరా. ఈ యింటి పేరుకు మంచికీ చెడ్డకీ వారసుడవి నువ్వు. మీ నాన్న కష్టాలూ, అప్పులూ తీర్చవలసిన వాడిని నువ్వూ - మగబిడ్డవి. దాన్ని రేపు ఏ అయ్య చేతిలోనో పెడదాం. భారం తీరిపోతుంది. పరాయి సొత్తయి పోతుంది"- కొడుకుతో యిట్లా మాట్లాడితే గాని ఆమెకు తృప్తి ఉండదు. హృదయభారం తీరదు.

"అదిగో అయింది. నిన్నటిదాకా సీత మాత్రం చదువుకోలేదూ, ఇంత మంది ఆడపిల్లలు ఉద్యోగాలు చేస్తే తప్పులేంది అది చెయ్యంగా వచ్చిందా అన్న దానివి ! ! మళ్ళీ నాన్న మాటలికి తాళంచేస్తూన్నావుటే అమ్మా. నువ్వు పది లక్షలు చెప్పమ్మా. మన మధ్యతరగతి వాళ్ళు - యీ కుడి ఎడమల తర్కంలో పడితే యింకా అధోగతి పాలవుతారు."

కొడుకు లెక్చరు పూర్తిచేసి లేచిపోతూంటే ఎదురుగా తండ్రి తయారైనాడు. ఆయన మెట్రిక్యులేషన్ రిజిష్టరులో మూడేళ్ళు చిన్నవాడినని రాయించు కోవటంవల్ల, నాలుగేళ్ళు ముందర్తిగానే ఉద్యోగంలోంచి రిటైరు కావలసి వచ్చింది. ఉత్తరీయం వంకెకు తగిలిస్తూ ఓరగా కొడుకువేపు చూశారు రమణారావుగారు.

"అమ్మా, సీతమ్మా-"

కొడుకూ-తండ్రీ యిద్దరూ గొప్ప దురభిమానులు. కడుపులో ప్రేమలు దాచుకొని శత్రువులు మాట్లాడుకొన్నట్టు మాట్లాడుకొంటారు. ఈ అలవాటు ఆ యింట్లో తరతరాలనుండీ వస్తున్న వారసత్వమే.

నాన్నగారు ఆదరాబాదరా స్నానం అయిందనిపించి మడిగట్టుకొని విస్తరి ముందు కూచున్నారు. అది బాదమాకుల విస్తరి. దళసరి ఆకుల బలానికి తట్టుకోలేక వూడివస్తున్న కుట్లు కొట్టవస్తున్నట్లుగా విస్తరి అంచుల్లో కనబడుతున్నాయి. సీత గడపమీద కూచొని అన్నయ్య లైబ్రరీలో తెచ్చి యిచ్చిన పాత వారపత్రిక తిరగేస్తున్నది. నాన్నగారు ఆందుకొన్నాడు.

"తల్లీ! మీ తాతగారి హయాంలో - అంటే మా నాన్నగారి టైములో నన్నమాట - ఈ ఇంట్లో డజను వెండి పళ్ళేలు వరసగా వడ్డీస్తేగాని మడి భోజనాలు ముగిసేవి గాదు. ఈ విస్తరి చూడు - దరిద్రపుది - యీ కుట్లూ - యిదీ."

'మనమే గాదులే నాన్నా, మనవంటి వాళ్ళ సంసారాలన్నీ యిట్లాగే వున్నాయి.'

"ఓహోహో! నువ్వు నేర్చావ్? ఈ పేపర్లు చదవద్దనేది అందుకే. దగుల్బాజీ వేదాంతాలు. ప్రతి దానికి అందర్నీ కలవటం. అందరివంటివాళ్లమా మసం. ఎవరికి తెలుసు? చేతికున్న అయిదువేళ్ళూ ఒకే ఎత్తా? వెధవాయిలు, వెధవాయిలని..."

"ఏమండీ—నెయ్యి వడ్డించకుండానే ముద్ద తినేస్తారూ—?" అని అమ్మ అడ్డువచ్చింది.

"చాలా గొప్ప నెయ్యేలే...యింతకూ వాడు వెళొచ్చిన పని కాయా పండా—నీకైనా చెప్పాడా?"

తల్లి సీతను చూసింది.

"కాయే నాన్నా..."

బయట గదిలో శీని స్నేహితులొచ్చారు—ఇద్దరు. ఒకడు రాజూ, రెండో వాడు ధర్మారావు. రాజు రాజకీయాల మీద, ధర్మారావు సినిమాల మీద, శీని మధ్యతరగతి మనుషులమీద వాదిస్తున్న ప్రలాపాలు కొన్ని వంటింటిదాకా జొరపడుతున్నాయి. నాన్నగారికి—మధ్యతరగతి వాళ్ళ కష్టాలన్నీ ఒకటేనని ఎవరైనా అన్నారా- ఒళ్ళు మండుతుంది. శీనిగాడికి ఉద్యోగం దొరకలేదన్న దిగులుకూడా లేదే? పొద్దుట్నించీ యిల్లు తాకట్టు వ్యవహారం తేల్చటానికి ప్లీడరు కొంపచుట్టూ తిరిగి తిరిగి తను వస్తే మధ్య శీనిగాడి శుష్క రాజకీయాలా? చివరకు వీడు గుంటపూలు పూచిపోయేట్టుగా వున్నాడు.

"వాణ్ణిట్టా పిలు—సీతమ్మా"

తల్లి కనుసన్న చూడకుండానే పోయి సీత అన్నయ్యను పిల్చుకొచ్చింది. వాళ్ళిద్దరి మధ్యా మాటల పొందిక కుదిరితే యీ ఇంట్లో వాతావరణం కొంత సళ్ళు విడుస్తుందని ఆ పిల్ల ఆశ.

నాన్ననుండి ఏ ప్రశ్నా రాకముందే, శీని ఉపోద్ఘాతం లేని తన స్టేటుమెంటు యివ్వ మొదలెట్టాడు. ఉట్టి వేళ్ళాడుతున్న మూల అమ్మ ఆకువలె వణికి పోతున్నది. శీని చూశాడుగాని రణరంగంనుండి విరమించటానికి వచ్చినట్లుగా లేదు.

"నే నప్పుడే అనుకున్నా—నాన్నా—ఆ ఉద్యోగం"

వంట గదిలో పెద్ద వురుము వురిమింది. ఉట్టి చేర్లు ఆ శబ్ద కెరటాలకు అటూ యిటూ వూగసాగినవి. అమ్మ మూలనుంచి తుళ్ళి పొయ్యి ముందుకు తూలి వచ్చింది.

"ఏడిశావ్–ఆ సంగతి నిన్నెవ్వరూ అఘోరించమనలే. నువ్వుబయట కూస్తూన్న వేదాంతం ఏమిటా అని ప్రశ్న–"

"ఏముంది నాన్నా! నేను కొత్తగా కనుక్కొన్నది గాదు. మీవంటి మధ్యతరగతి తలిదండ్రులు అనుభవిస్తూ గూడా గ్రహించలేని కొన్ని కఠిన సత్యాలను గురించి రాజు నేనూ మాట్లాడుకొంటున్నాం."

"అదే ఆ ఘన సత్యమే–మా మట్టి బుర్రల్లో ఎక్కని ఆ కఠిన సత్యమే–ఏమిటని?"

"చాలా చిన్న విషయం. తినేవాళ్ళు ఎక్కువ, పని చేసేవాళ్ళు తక్కువ అయితే ఆ యింట్లో దరిద్రం. ఒరుమానం తక్కువ, మర్యాద లెక్కువా అయినా దరిద్రమే."

నీళ్ళతో వున్న కంచు గుండుగ్లాసును చేతిలోకి, హాండ్ గ్రెనేడ్‌ను తీసుకున్నట్టు తీసుకొని విసిరేసి నాన్న కస్సుమని త్రాచుపాము బుసతో విస్తరిముందు నుంచి లేచి నిలబడి శీనిగాడి మీదికి పోయాడు.

"ఏమని కూశావురా?–అంటే సీతగూడా నీతో పాటు ఎక్కేగడప దిగే గడప లెక్కబెడుతూ ఉద్యోగానికి బయల్దేరాలనా? తిండితో సరి అనుకొన్నా వురా వెధవ పుట్టక? ఇక మర్యాదా మన్నూ అక్కర్లా. నీ చెల్లెల్ని వీధిలో రవుడీల మాటలికి ఒప్పగిస్తావా మా యింటా వంటా లేనిది–జన్మెత్తావ్. నీ ముఖం చూపించవాకు పో–పోవేరా? సంప్రదాయం తెలీని దౌర్భాగ్యుడా!"

శీని వెళ్ళిపోయాడు. వాడువెళ్ళేసరికే రాజూ ధర్మారావు అక్కడ లేరు. సీత గడపకు తలుపునకూ మూల ఒదిగి నుంచొన్నది.

"ఈ యిల్లు తాకట్టు పెడుతున్నాను. వాళ్లడిగిన కట్నం తెచ్చి పోస్తాను. ఐదు రోజుల పెండ్లి చేస్తాను. మూడు బ్యాండు మేళాలు పెట్టిస్తాను. నా తల్లికి జమీందారీఫాయీలో పెళ్ళి చేయిస్తాను. కాలేజీలో నాలుగు ముక్కలు చదివిందని మగవాడితో సమానంగా దిక్కుమాలిన ఉద్యోగానికి తోల్తానా?"

అమ్మ మీద అన్నయ్యమీద యిది సవాలని సీతకు తెలుసు. ఇల్లు తాకట్టు పత్రం నాన్నకోటులో తను చూచినమాట గూడా నిజం. మళ్ళీ ముహూర్తాల కని పెళ్ళి వాళ్ళని వచ్చే వారం రమ్మని చెప్పింది నాన్న యిందుకే గామోలు. ఈ లోపల తను చచ్చిపోతే అందరి సమస్యలు సమసి పోతాయి గదా?

సరిగ్గా ఆ క్షణానికే అమ్మ వచ్చి భుజం పట్టుకొని తన హృదయంలోనికి తొంగిచూచి తన ఆలోచనలను కనిపెట్టినట్టుగా—"ఏమిటే—పిచ్చి ఆలోచన్లు-తల్లీ—" అని తన తలను గుండెకు అదుముకొన్నది.

సీత—''అమ్మా!'' అన్నది. అంటూనే బావురు మంది. నాన్న తిరిగి వచ్చి చూచి స్తంభంవలె కదలక మెదలక నిల్చొని గిరుక్కున మరలి పొయ్యాడు. సీత పెదిమల మీదికి "నాన్నా" అని వచ్చింది. అయితే మాట పెగల్లేదు. నాన్నకు వినబడలేదు.

* * *

"ఏదమ్మా—నా సింహాసనం?" అని తన పాత వడక కుర్చీకోసం సీతను పురమాయించిన నాన్న నించొన్నవాడు నించొన్నట్టుగానే పడిపోయాడు.

సీత, అమ్మా గొల్లుమన్నారు.

"నాన్నా! మాట్లాడవేం నాన్నా. మాట్లాడవేం? మమ్మల్ని అన్యాయంచేసి పోతావా?"

నాన్న నోట మాటరాలేదు. గుడ్లు మాత్రం మూతపడక, నిండా నీళ్ళు నింపుకొని సీతవంకా, వాళ్ళమ్మవంకా తేరిపార జూస్తున్నాయి.

నాన్నా. నాన్నా. ఏమండీ. ఏమి బాధండీ. క్షణంలో యిటుగు పొరుగు వారు పది మంది పోగై ఆయనకు గాలి కూడా తగలకుండా వలయం కట్టారు.

"పక్షవాతమండీ"

"నోటి పక్షవాతమండీ"

"కాదు నాలుకకు"

"ఏదో ఒకటి—యింకా చూస్తూ నుంచుంటారే, వైద్యుణ్ణయినా పిలవండి, ఆస్పత్రికయినా తీసుకెళ్ళండి"

ఆ రోజున—నాన్నతో ఘర్షణ జరిగినరోజునే—యిల్లు బయలుదేరి వెళ్ళిన శీనిగాడు యింతవరకు—అయిపులేడు. అమ్మ గుండె గట్టిది. సీతను కాళ్ళు పట్టమని, తను తలపట్టుకొని, నాన్నను ఆ గుంపు నుంచి తప్పించి మంచం మీద పడుకో బెట్టింది. కుండలో మంచినీళ్ళు తెచ్చి నాన్నకు పట్టింది. ఆశ్చర్యకరంగా నాన్న నోటినుంచి యిందాకటివలె—పెదిమల కదలికగాక నిజంగా మాటలే వెలువడినాయి.

"సీతమ్మా—నా తల్లీ."

"మీకు జ్వరంగా వుంది. మాట్లాడక కళ్ళుమూసుకు పడుకోండి" అని అమ్మ చెప్పింది.

సీత నాన్న శరీరం పట్టుకొని, తలమీద తాకి చూచింది. జ్వరం మండి పోతున్నది. సీత బజారు మూలదాకా పోయి జట్కా బండిని పిలుకొచ్చింది. ఇంకో అరగంటలో నాన్నను ఆస్పత్రిలో చేర్చారు. పెద్ద డాక్టరన్నాడు "రక్తపు పోటు. మనిషి చాలా ఆందోళనల్లో వున్నాడా?"

సీతా అమ్మా ఒకరివంక ఒకరు చూచుకొన్నారు. ఆందోళనా? జీవితమే పెద్ద ఆందోళన. ప్రతి క్షణమూ పెద్ద ఆందోళన. శీనిగాణ్ణి గురించి నాన్న ఒక్క ముక్కగూడా అడగలేదు. ఏం దురభిమానాలు? మర్నాటినుంచీ సీత–యింటికీ ఆస్పత్రికీ బలపంగట్టుకు తిరగసాగింది. కాఫీ, భోజనం, సాయంత్రం అమ్మను తీసుకొచ్చి చూపటం, తిరిగి రాత్రి భోజనం.

సాయంత్రం వచ్చినప్పుడు–శీనిగాడు హైదరాబాదునుంచి రాసిన ఉత్తరం తెచ్చి యిచ్చింది. ''నేను చదవనా నాన్నా?'' అని అడిగింది. కాని నాన్న చేయి చాపాడు. తనే చదువుకొన్నాడు.

''నీమీద కోపంవల్ల వెళ్ళలేదు నాన్నా నేను. అక్కడ నాకు ఉద్యోగం దొరికే ఆశలేదని యిక్కడి కొచ్చాను. పైకి గాకపోయినా నువ్వు నాకోసం దిగులు పడక మానవు. నువ్వు మంచివాడివి – ఈ దేశంలో ఆకస్మాత్తుగా వస్తున్న ఈ మార్పుల్ని చూసి భయపడ్తున్న వాడివి. నీలో కుళ్ళు లేదు. కుండ బద్దలుకొట్టే విధంగా మాట్లాడే స్వభావం. చాలా అప్లికేషన్లు పెట్టాను–అట్లా దొరక్కపోతే–భూమ్యాకాశాల్ని తలకిందులు చేసే నా ఉద్యోగం సంపాదిస్తాను. స్వీపరు ఉద్యోగాలు చాలా ఖాళీగా వున్నాయి. మొదట్లో అందులో చేరితే నాకు ప్రస్తుతం వుపవాసం యింకా కొనసాగించే అవసరం వుండదు. యింతే సంగతులు. పోతే ఒక మాట. ఇక్కడ ఆఫీసుల్లో చాలా మంది ఆడపిల్లలు పనిజేస్తున్నారు. చాలా మంది మన సీత యీడువాళ్ళు. చిత్తగించ వలెను."

ఈ మూడు రోజుల్లోనూ నాన్న కొంచెం తేరుకున్నాడు. శీనిగాడికి జవాబు వ్రాస్తావా అంటే ఉహూ అన్నాడు. అన్నం అరుగుతున్న దన్నాడు. ఎంత లేదన్నా పది రోజులన్నా వుండాల్సివస్తుందన్నాడు డాక్టరు.

ఆ మధ్యాహ్నం నాన్నకు కారియర్‌లో భోజనం పట్టుకొని సీత బయలుదేరబోతుంటే–యింటి ముందు రిక్షాలో నాన్న తయారు.

"ఇదేం పని నాన్నా?"

బ్రహ్మంతవాడు అడ్డం వచ్చినా తను చెయ్య–దలచుకొన్న పనిని పూర్తిగా చెయ్యందే నాన్నకు నిద్రబట్టదని అందరికీ తెలుసు. కాని యిట్లా

ఆస్పత్రినుంచి ఎందుకు పరుగెత్తి వచ్చినట్లు? అందులో తనున్న పరిస్థితిలోనా? నాన్న ముఖంలో గాభరాపడుతున్న సూచనలు బొత్తుగా లేవు.

"ఇవ్వాళ పెళ్ళివాళ్ళు వస్తారు. ఆ ముసలమ్మా వాళ్ళు నిన్ను చూస్తారట. అయిన వాళ్ళుగదుటమ్మా. మగవాళ్ళు లగ్నం విషయం మాట్లాడ తారుగాబోలు."

అమ్మ ఫలహారాలు చేయించటంలో సతమతమవుతూ సీతను కొత్తచీర కట్టుకోమన్నది. కథల్లో ఆడపిల్లలాగా సీత తనను గురించి ఆలోచించుకో లేదనా? "వాళ్ళు" జట్కాదిగినప్పుడు సీత గుండెలో ఏమిటోగా వుంది. తనను గురించి నాన్న-హృదయంలో ఎన్ని గాయాలు రేపుకొంటున్నాడు? ఈ ప్రపంచంలో ఏ త్యాగంచేసైనా తనను సుఖపెట్ట గోరుతున్న నాన్న మనస్సునా తను కించ పరచటం? ఇనప చట్రం వెనుక, కటువు మాటల వెనుక, కోపవు చేష్టల వెనుక—దాగివున్న నాన్న వెన్నపూసగుండెను తనొక్కతే చూడగలదు ఆ వ్యధిత హృదయాన్ని తనొక్కతే అర్థం చేసుకోగలదు.

ఎదురుగా పోయి—నాన్న వాళ్ళను తీసుకొచ్చి, మర్యాదగా, నవ్వుతూ, కులాసాగా కబుర్లు చెప్పాడు. ఇంత దర్జా మనిషి—నాన్న—చేతినిండా డబ్బే వుంటేనా?

ఫలహారాలు అయినాక తాంబూలాలు సేవిస్తూ పెళ్ళివారు ప్రస్తావనగా- "ఏమండీ బావగారూ! యిక చెప్పండి" అని ఉపోద్ఘాతం ఉపక్రమించారు. ముసలమ్మ సీతను చూసి ముచ్చట పడ్డదిగా మరి. ఇక నాన్న వాళ్ళ షరతుల కన్నీ ఓవ్పుదల అయినట్లుగా తలవూపాలి గామోలు.

అప్పటికీ నాన్న ముఖంలో ఆందోళనా, విచారం ఏమీ కనబడలేదు.

''ఏమీలేదండి, మా అమ్మడికి పెళ్ళి వెనక పెట్టాలనుకొంటున్నా. దానిగ్గూడా ఉద్యోగమే చెయ్యాలని వుంది.'' నాన్న నవ్వుతూనే సమాధానం చెప్పాడు.

నాన్నా!

సీతా అమ్మా ముఖాలు చూచుకొన్నారు. పెళ్ళి వాళ్ళు ముఖాలు చూసు కొన్నారు.

పెళ్ళివాళ్ళూ తెలుగువాళ్ళేగదా మరి. రోషానికి బిడ్డలు. కొంచెం అవమానంపడి, అమర్యాదను నిరూపిస్తూ వెళ్ళిపోయారు. నాన్న సీతతో ఎప్పుడూ అంటూండే వాడు—''తల్లీ—ఒకచేత్తో కలం, మరొకచేత్తో ఖడ్గం, కళ్లతో రాజకీయం, నోటితో మంత్రిత్వాలు నిర్వహించిన వంశాలు మనవి.

ఈ నాటికి దాస్యంలో పడ్డాం. మా తాతగారూగూడా మాన్యాలూ, ఈనాములు దానం చేసిన మనిషి.''

మరి పెళ్ళివాళ్ళు మాత్రం యీ వంశీకులు గాదూ! అయితేనేం—నాన్న లెక్కచెయ్యక సీతవంక తిరిగి అన్నాడు—

''సీతమ్మా శీనిగాడు వెళ్ళిన ఉద్యోగం—నీకిస్తారు. మన పాత డాక్టర్ గారి తమ్ముడి రికమండేషను. వస్తూ వస్తూ అదీ తేల్చుకొచ్చాను. రేపే వెళ్ళి చేరాలి. రవుడీ వెధవలు కొక్కిరాయి మాటలేమన్నా అన్నారా-గాడిదెల్ని చెప్పు మడమతో తన్ను.''

సీత సంతోషం పట్టలేక-''అన్నయ్యకు రాయనా నాన్నా'' అని అడిగింది. ఆ మాటతో నాన్నకు కోపం వచ్చి-"ఊహు, అక్కర్లే" దన్నాడు. అమ్మ నవ్వుకున్నది. ○

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)